క్లుప్తంగా

4న జలవిహార్‌కు తరలిరండి..



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

కొత్తగూడెంటౌన్: హైదరాబాద్‌లోని జలవిహార్‌లో 4వ తేదీన జరగనున్న ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ లీగల్ సెల్ జిల్లా బాధ్యులు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో వాల్‌పోస్టరుల ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలివెల గణేష్‌బాబు, గాజుల రామ్మూర్తి, జంగాల పద్మారావు, బి.చిరంజీవరావు, శెట్టిపల్లి వెంకటరామారావు, మల్లేల ఉషారాణి, గుమ్మడి శాంత, రాచకంట్ల సుజాత, జి.శిరీష, వేముల మధుకర్, మహ్మద్ అబ్దుల్ రఫీక్, కె.శ్రీధర్, పల్నాటి రమణ, శ్రీరాముల రవి, ఎన్.స్వేత, పిరూప, లక్కినేని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

చుంచుపల్లి: సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలు ఉన్నందున చుంచుపల్లి మండల సర్వసభ్య సమావేశం బుధవారం సాదాసీదాగా జరిగింది. ఈ సమావేశానికి ఎంపీపీతో పాటు, ఎంపీటీసీలు, పలువురు సర్పంచులు హాజరయ్యారు. ఎన్నికల నియమావళి మేరకు ప్రజాప్రతినిధులు, అధికారులు మాట్లాడకుండానే సంతకాలు చేసి ముగించారు. ఎంపీపీ బాదావత్ శాంతి, ఎంపీడీఓ మంగమ్మ, ఎంపీఓ సత్యనారాయణ, మండల అధికారులు పాల్గొన్నారు.

ఖాదర్‌బాబుకు నివాళి

పాల్వంచ: పేదల, కార్మికుల శ్రేయస్సు కోసం పోరాడిన గొప్ప వ్యక్తి ఉప్పుశెట్టి ఖాదర్ బాబు అని, ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం అన్నారు. సీపీఐ జిల్లా సమితి సభ్యుడు, మాజీ కౌన్సిలర్ ఉప్పుశెట్టి ఖాదర్ బాబు వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఖాదర్ బాబు స్మారక స్థూపం వద్ద అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. విశ్వనాథం మాట్లాడుతూ.. ఖాదర్‌బాబు నిత్యం ప్రజా సమస్యలపై స్పందించేవారన్నారు. కార్యక్రమంలో నరాటి ప్రసాద్, వీసంశెట్టి పూర్ణచందర్ రావు, బండి నాగేశ్వరరావు, దుగ్గిరాల సుధాకర్, గుండాల నాగరాజు, యూసుఫ్, అన్నారపు వెంకటేశ్వర్లు, రాకేశ్, శనిగారపు శ్రీనివాస రావు, నరహరి నాగేశ్వరరావు, నాగమల్ల సత్యనారాయణ, కోరె కృష్ణ, గోపి, ఉపేందర్, పాషా, జకరయ్య తదితరులు పాల్గొన్నారు.

గురుదాస్ గుప్తాకు..

ఇల్లెందు: భారత కార్మికోద్యమ నాయకుడు గురుదాస్ గుప్తా అలుపెరుగని పోరాట యోధుడని ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.రాజ్‌కుమార్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.సారయ్య, బ్రాంచి కార్యదర్శి నజీర్ అహ్మద్ అన్నారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో గుప్తా వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సమావేశంలో రాజారామ్, మోజేష్, నాగేశ్వరరావు, సంజీవ చారీ, శంకర్, బంధం నాగయ్య, ఉడుత ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ సభకు తరలివెళ్లిన ప్రజలు


మద్రాస్‌తండా నుంచి ఇల్లెందు సభకు బయలుదేరుతున్న కార్యకర్తలు

టేకులపల్లి: ఇల్లెందులో బుధవారం నిర్వహించిన కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు టేకులపల్లి నుంచి ప్రజలు, కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు. మండలంలోని 36 గ్రామ పంచాయతీల నుంచి బీఆర్‌ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఇన్‌చార్జ్‌లు పలు వాహనాల్లో ఇల్లెందు సభకు తరలించారు.

పశువైద్యుడు లేక ఆరేళ్లు!

టేకులపల్లి: టేకులపల్లి, బోడు గ్రామాల్లో పశువైద్యశాలలు ఉన్నాయి. వీటి పరిధిలో సంపత్ నగర్, బొమ్మనపల్లి, ముత్యాలంపాడు పశువైద్య ఉప కేంద్రాలు కొనసాగుతున్నాయి. బోడు గ్రామంలో ఎనిమిదేళ్ల క్రితం పశువైద్యశాలకు నూతన భవనం నిర్మించారు. ఇక్కడ పనిచేసిన పశువైద్యాధికారి 2017లో బదిలీ అయ్యారు. ఆనాటి నుంచి నేటి వరకు భర్తీ చేయనేలేదు. టేకులపల్లి వైద్యుడే ఇంచార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. బోడు పశువైద్యశాలలో ప్రస్తుతం జేవీఓ, ఓఎస్ ఇద్దరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. బోడు వైద్యశాల పరిధిలో సుమారు 4,850 ఆవులు, గేదెలు, 4,900 మేకలు, గొర్రెలు ఉన్నాయి. ప్రతి సంవత్సరం టీకాలు, తదితర వైద్యసేవలకు ఈ ఇద్దరిపైనే భారం పడుతోంది. ఉన్నతాధికారులు స్పందించి బోడు వైద్యశాల వైద్యుడి పోస్టుని భర్తీ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నత్తనడకన బీటీ రోడ్డు నిర్మాణం

- అస్తవ్యస్తంగా డ్రెయినేజీలు
- ఇబ్బంది పడుతున్న కొత్తూరు, చిన్నహరిజనవాడ ప్రజలు
- పట్టించుకోని అధికారులు


డ్రెయినేజీ నిర్మించకుండా వదిలేసిన వీధి

జూలూరుపాడు: మండలంలోని పాపకొల్లు ఆర్‌అండ్‌బీ నుంచి రాజారావుపేట క్రాస్ రోడ్డు వయా కొత్తూరు వరకు చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులు నతనడకన కొనసాగుతున్నాయి. ఐటీడీఏ నిధులు రూ.1.40 కోట్లతో జడలచింత నుంచి వయా కొత్తూరు మీదుగా రాజారావుపేట క్రాస్ రోడ్డు వరకు బీటీ రోడ్డు పనులు చేపట్టి ఎనిమిది నెలలు గడిచినా పనులు పూర్తి కాలేదు. జడలచింత నుంచి రాజారావుపేట క్రాస్ రోడ్డు వరకు బీటీ రోడ్డు నిర్మాణంలో భాగంగా మెటల్ (కంకర) పోసి నెలలు గడిచింది. అయినా పనుల్లో ఎలాంటి పురోగతి లేదు. బీటీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో కొత్తూరు, చిన్నహరిజనవాడ ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్యం కోసం గానీ, ఇతర పనులకు మండల కేంద్రానికి వెళ్లాలంటే ప్రజలకు ఇబ్బందిగా ఉంది. రాత్రి సమయాల్లో రాకపోకలు సాగించడం మరింత ఇబ్బందికరంగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే కొత్తూరు, చిన్నహరిజనవాడతోపాటు, పెద్దహరిజనవాడ, రాజారావుపేట గ్రామాల ప్రజల రాకపోకలకు సౌకర్యంగా ఉంటుంది. బీటీ రోడ్డు నిర్మాణంతోపాటు కొత్తూరు గ్రామంలో చేపట్టిన డ్రెయినేజీలను అస్తవ్యస్తంగా నిర్మించారు. కొనిచోట్ల నిర్మాణ పనులు పూర్తి కాలేదు. పలు ఇళ్ల వద్ద ప్రహరీలు అడ్డురావడంతో తొలిగించేందుకు కొందరు వ్యక్తులు అభ్యంతరం చెప్పడంతో కాంట్రాక్టర్ డ్రెయినేజీలను అసంపూర్తిగా వదిలేశారు. రాజకీయ అండదండలు, పలుకుబడి, ఆర్థిక బలవంతుల ఇళ్ల ప్రహరీలు తొలగించే సాహసం చేయలేక కాంట్రాక్టర్ పనులు వదిలేశాడని స్థానికులు చెబుతున్నారు. అడ్డు వచ్చిన కంచెలను తొలిగించినప్పుడు ప్రహరీలను ఎందుకు తొలగించడం లేదని అధికారులను స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఒకరికి ఒక న్యాయం, బలవంతులకు మరో న్యాయమా? అని స్థానికులు అంటున్నారు. కాంట్రాక్టర్ స్థానికుడు కావడం వల్లే బీటీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదంటున్నారు. నాసిరకంగా డ్రెయినేజీల సైడ్ వాల్ నిర్మించడంతో అక్కడక్కడ పగుళ్లు కూడా వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు పర్యవేక్షణా లోపంగానే పనులు అస్తవ్యస్తంగా జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిలిచిపోయిన బీటీ రోడ్డు, డ్రెయినేజీల నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై ఐటీడీఏ ఏఈ ఐ.వెంకట నాగప్రసాద్‌ను వివరణ కోరగా... బీటీ రోడ్డు పనులు డిసెంబర్ చివరినాటికి పూర్తి చేస్తామని చెప్పారు.


నిలిచిపోయిన కొత్తూరు బీటీ రోడ్డు పనులు

రోడ్డు పనులు పూర్తి చేయాలి



బీటీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలి. కంకర రాళ్లు పైకి తేలడంతో ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఇప్పటికై నా అధికారులు స్పందించి అసంపూర్తిగా మిగిలిన బీటీ రోడ్డు, గ్రామంలోని వీధుల్లో డ్రెయినేజీల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి. – బూరం నరేష్, కొత్తూరు

అధికారులు స్పందించాలి



ప్రజలు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలి. చిన్నహరిజనవాడలో డ్రెయినేజీల కోసం ఇష్టారాజ్యంగా తవ్వి వదిలేశారు. కొత్తూరు, చిన్నహరిజనవాడల మధ్య రహదారికి ఇరువైపుల డ్రెయినేజీలు నిర్మించాలి. –గార్లపాటి వీరభద్రరావు, చిన్నహరిజనవాడ

పాలస్తీనాకు అండగా నిలవాలి


ప్లకార్డులతో ప్రజా, రైతు సంఘాల నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): గాజాపై ఇజ్రాయిల్ దాడులను ఆపాలని ఐక్యరాజ్య సమితిలో తీర్మానంప్రవేశ పెడితే భారత్ ఓటింగ్‌కు గైర్హాజరు కావటం అంటే సామ్రాజ్యవాద అమెరికాకు తొత్తుగా వ్యవహరించడమేనని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ, రేపాకుల సత్యనారాయణ అన్నారు. బుధవారం కొత్తగూడెంలోని మంచికంటి భవన్ ఎదురుగా సీఐటీయూ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ఐద్వా, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 16 సంవత్సరాలుగా పాలస్తీనాకు అంతర్జాతీయంగా సహకరించే దేశాలను అమెరికా కట్టడి చేస్తోందని, గాజాకు ఆహారం, ఇంధనం, మందులు ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోనివ్వకుండా కక్ష్య సాధింపు చర్యలకు దిగుతోందన్నారు. మహాత్మాగాంధీ నేతృత్వంలో భారతదేశం పాలస్తీనాకు మద్దతుగా నిలబడిందని, నేడు ఇదే పద్ధతి పాటించాలన్నారు. కార్యక్రమంలో లిక్కిబాల రాజు, జ్యోతి, వీరన్న, వీరభద్రం, సమ్మయ్య, సందకూరి లక్ష్మి, నందిపాటి రమేష్, వై.వెంకటేశ్వరరావు, ధరావత్ వెంకన్న, బాలకృష్ణ, రాములు, రమ, రాజ్యలక్ష్మి, నాగకృష్ణ, రామ్‌చరణ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

జూలూరుపాడు: మండలంలోని పాపకొల్లు, జూలూరుపాడు, పడమటనర్సాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని 33 కేవీ విద్యుత్‌లైన్ మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు జూలూరుపాడు ఏఈ సతీష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా ఉండదని రైతులు సహకరించాలని కోరారు.

11న మాదిగ విశ్వరూప మహాసభ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

జూలూరుపాడు: పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11న హైదరాబాద్‌లో జరగనున్న మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి మిర్యాల కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం జూలూరుపాడులో మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. ఈ సభకు మాదిగలందరూ రాజకీయాలకు అతీతంగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు పోతురాజు నాగరాజు, కోట కుమార్ బాబు, ఇడుపుల సాంబ, తంబర్ల పుల్లారావు, గార్లపాటి శివకృష్ణ, స్టాలిన్, మందా దేవేందర్, పోతురాజు పవన్, మోహన్‌రావు, ఈట కృష్ణ, దేవరకొండ చంటి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెంలో 91శాతం బొగ్గు ఉత్పత్తి

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో అక్టోబర్‌లో సంస్థ నిర్దేశించిన 11.98 లక్షల టన్నుల లక్ష్యానికి 10.82 లక్షల టన్నులు 91శాతం ఉత్పత్తి చేసినట్లు ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా అక్టోబర్‌లో రైలు, రోడ్డు ద్వారా 12.35 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేసి సింగరేణి వ్యాప్తంగా అగ్రస్థానంలో నిలిచిందని, ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు ఏడు నెలల్లో 71.19 లక్షల టన్నుల లక్ష్యానికి 78.43 లక్షల టన్నులతో 110 శాతం ఉత్పత్తి చేసిందని, రోడ్డు, రైలు మార్గం ద్వారా 89.33 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసినట్లు పేర్కొన్నారు.

అక్టోబర్‌లో 149 శాతం ఉత్పత్తి..

అక్టోబర్‌లో ఓవరాల్ సింగరేణి 86 శాతం సాధించగా, బెల్లంపెల్లి ఏరియాలో గతంలో ఎన్నడూ లేని విధంగా 172 శాతం సాధించి సింగరేణి వ్యాప్తంగా అగ్రస్థానం, ఇల్లెందు ఏరియాలో 149 శాతం సాధించి సింగరేణి వ్యాప్తంగా రెండోస్థానంలో నిలిచింది. మణుగూరు ఏరియా 105శాతం, కొత్తగూడెం ఏరియా 91శాతం సాధించాయి.

టీఆర్‌వీకేఎస్‌కు పలువరి గుడ్‌బై


కండువా కప్పి ఆహ్వానిస్తున్న శ్రీధర్

పాల్వంచ: బీఆర్‌ఎస్ అనుబంధ టీఆర్‌వీకేఎస్ కార్మిక సంఘం నుంచి ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో పలువురు కార్మిక నేతలు యూనియన్‌ను వీడారు. సంఘం సీనియర్ నాయకుడు సాధం రామకృష్ణ తన అనుచరులతో కలిసి తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (327)లో చేరారు. బుధవారం స్థానిక 327 కార్యాలయంలో జెన్‌కో కార్యదర్శి మాజీద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో యూనియన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఈ.శ్రీధర్ సమక్షంలో సాధం రామకృష్ణతో పాటు పలువురు చేరారు. ఈ సందర్భంగా శ్రీధర్ యూనియన్‌లో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానించారు.

శ్రీధర్ మాట్లాడుతూ.. విద్యుత్ కార్మికుల సమస్యలపై సుదీర్ఘ అనుభవం, అవగాహన కలిగిన రామకృష్ణ 327లోకి రావడం శుభపరిణామమన్నారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ.. కార్మిక శ్రేయస్సే తన లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో ఐలేశ్, మహేందర్‌రెడ్డి, కె.బాబు, శ్రీనివాస్, మాధవరావు, బాబు, రవికుమార్, సత్యనారాయణరెడ్డి, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ సభతో ట్రాఫిక్ కష్టాలు


టేకులపల్లి సెంటర్‌లో పోలీసు బందోబస్తు


నిలిచిపోయిన పరకాల డిపో ఆర్టీసీ బస్సు

టేకులపల్లి: ఇల్లెందులో బుధవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ హాజరయ్యారు. బొజ్జాయిగూడెంలో సింగిల్ రోడ్డు సమీపంలో సభ నిర్వహించడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. సాయంత్రం 4 గంటల నుంచి ఇల్లెందులో సీఎం సభ ముగిసి వాహనాలన్నీ క్లియర్ అయ్యేంత వరకు కొత్తగూడెం నుంచి ఇల్లెందు వైపు వెళ్లే బస్సులు, లారీలు, కంటైనర్లు, యాష్‌ట్యాంకర్లు, టిప్పర్లు, ట్రాలీలు, డీసీఎంలు తదితర వాహనాలను టేకులపల్లి సెంటర్‌లో నిలిపి బోడు మీదుగా వయా మర్రిగూడెం నుంచి ఇల్లెందుకు మళ్లించారు. టేకులపల్లి నుంచి ఇల్లెందు 20 కిలోమీటర్లు కాగా బోడు మీదుగా వయా మర్రిగూడెం నుంచి ఇల్లెందుకు సుమారు 40 కిలోమీటర్లు చుట్టుతిరిగి వెళ్లాల్సి వచ్చింది. వేరేప్రాంత వాహనదారులు రూట్ తెలియక ఇబ్బందులు పడ్డారు. పరకాల డిపో హనుమకొండ బస్సు కూడా రోడ్డు మీద నిలిచిపోయింది. జూలూరుపాడు ఎస్ఐ పురుషోత్తం ఆధ్వర్యంలో పోలీసులు టేకులపల్లి సెంటర్ నుంచి వాహనాలను బోడు వైపుకి మళ్లించారు.

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు


హాజరైన విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని ప్రియదర్శిని కళాశాలలో బుధవారం సైబర్ నేరాలపై అవగహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ కృష్ణయ్య హాజరయ్యారు. మాట్లాడుతూ... సైబర్ నేరాలు ఎలా జరుగుతున్నాయి.. వాటికి స్పందించవద్దని, తప్పించుకునే మార్గాలను వివరించారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ లెటర్, గూగుల్ ప్లాట్ ఫారమ్స్‌లో వస్తున్న ప్రకటనలు అన్నీ నిజమైనవి కాకపోవచ్చని, వాటిని నమ్మి ముందుగా డబ్బులు చెల్లించి మోసపోవద్దని సూచించారు. సైబర్ మోసగాళ్లు ఎలక్ట్రానిక్స్, వస్త్రాలు, ఇతర నకిలీ ప్రకటనలతో మెయిల్, మెసేజ్, ఫోన్ కాల్ ద్వారా ఓటీపీ తెలుసుకొని మీ బ్యాంకు ఖాతాలోని డబ్బులు దోచేస్తారని తెలిపారు. క్యాష్ ఆన్ డెలివరీ పెట్టి, ముందుగా మీకు నకిలీ, డ్యామేజ్ అయిన వస్తువులు పంపించి మీరే వాళ్ల కాంటాక్ట్‌లోకి వెళ్లేలా చేసి మీ బ్యాంకు వివరాలు తెలుసుకుని డబ్బులు లాగేస్తారని వివరించారు. అపరిచిత కాల్స్ వస్తే 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఇన్‌స్పెక్టర్ జితేందర్, కళాశాల డైరెక్టర్ శ్రీరమనేని చలపతిరావు, ప్రిన్సిపాల్ నయీమ్‌పాషా, వైస్ ప్రిన్సిపాల్ రాయల వివేక్, పీడీ కసిమల్ల రమేష్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించండి


ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

టేకులపల్లి: ఈనెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి ఇల్లెందు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోతు హరిప్రియను గెలిపించాలని హరిప్రియ హరిసింగ్ నాయక్ యువసేన అధ్యక్షుడు జాటోతు నరేష్ నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం ప్రెగళ్లపాడు పంచాయతీ పరిధిలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు జాటోతు సీతారాం నాయక్, పార్టీ నాయకులు బాదావత్ నాగేశ్వరరావు, అంగోత్ బిక్కులాల్, మాలోత్ లింగా, అంగోత్ దస్రు, అంగోత్ మంగీలాల్, జాటోత్ చంద్రు, జాటోత్ హీరాలాల్, జాటోత్ సాయికుమార్, బానోత్ మహేష్, తేజావత్ మహేందర్, మహేష్, సతీష్, జాటోత్ మోహన్, అంగోత్ గౌరీ, మాలోత్ గోపి, తేజవత్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే టికెట్ బీసీలకు కేటాయించాలి


మాట్లాడుతున్న బీసీ నాయకులు

పాల్వంచ: కొత్తగూడెం ఎమ్మెల్యే టికెట్ బీసీలకు కేటాయించాలని కొత్తగూడెం నియోజకవర్గ బీసీ హక్కుల సంఘం నాయకులు జోగేశ్వరాచారి, వెంకన్నగౌడ్ అన్నారు. బుధవారం స్థానిక టీపీసీసీ నాయకుడు ఎడవల్లి కృష్ణ ఇంటి వద్ద సమావేశంలో వారు మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీసీలు ఓటు వేయాలంటే బీసీ నేతలకే టికెట్ కేటాయించాలన్నారు. అధికార బీఆర్‌ఎస్ పార్టీ బీసీకి టికెట్ కేటాయించినప్పుడు కాంగ్రెస్ కూడా బీసీలకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బండి సత్యనారాయణ, సాంబయ్య, హరి ప్రసాద్, కమలాకర్, తవుడోజు సత్యనారాయణ, ధర్మపురి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే వారికే పట్టం కట్టండి..


స్థానికులతో మాట్లాడుతున్న కామేశ్

పాల్వంచ: ప్రజా సమస్యలపై ప్రభుత్వాలను ప్రశ్నించే వారికే పట్టం కట్టాలని బీఎస్పీ కొత్తగూడెం ఎమ్మెల్యే అభ్యర్థి యెర్రా కామేశ్ అన్నారు. బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని తోగ్గూడెం, దంతెలబోర, నారాయణరావుపేట, సంగం పంచాయతీల్లో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాట్లాడుతూ.. నిస్వార్థంగా, నిజాయితీ, నిబద్ధతతో పనిచేసే స్థానికుడిని ఎన్నుకోవాలన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని, దేశంలో అవినీతి పేరుకుపోయిందన్నారు. అడ్డదారిలో సంపాదించిన సొమ్ముతో కొందరు రాజకీయాల్లోకి వచ్చి వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తున్నారని వాపోయారు. ఎన్నికలు రాగానే డబ్బు సంచులతో ఊళ్లల్లో మకాం వేసి ఓట్లు కొనుగోలు చేస్తుంటారన్నారు. అటువంటి వారికి నిజాయితీతో ఓటు వేసి తగు బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో కాటబోయిన వసుంధర, కోళ్లపూడి ప్రవీణ్, అనిల్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి


కళాజాతా నిర్వహిస్తున్న కళాకారులు

సుజాతనగర్: ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం కళాకారులు పేర్కొన్నారు. బుధవారం సుజాతనగర్‌లో పలుచోట్ల టీం లీడర్ పాగి వెంకన్న ఆధ్వర్యంలో కళాజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఓటుహక్కు వినియోగంపై పాటల రూపంలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఓటు అనే ఆయుధంతోనే సమాజంలో మార్పు జరుగుతుందని వివరించారు. ఓటు హక్కును ఓటర్లు విధిగా వినియోగించుకోవాలని కోరారు. ఓటు ద్వారానే మంచి నాయకుడిని ఎన్నుకోగలుగుతామన్నారు. కలెక్టర్, సమాచార పౌరసంబంధాలశాఖ ఆదేశాల మేరకు జిల్లా అంతటా కళాజాతా ప్రదర్శనలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బృందం సభ్యులు పమ్మి రవి, బొమ్మెర ముత్యం, యంగళ కుమారి, గోవింద గురవయ్య, నకిరికంటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయ సాధనకు కృషి

జూలూరుపాడు: తెలంగాణ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టు యోధులు వీరమరణం పొందారని, వారి ఆశయాల బాటలో నడుద్దామని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ మండల కార్యదర్శి బానోత్ ధర్మా అన్నారు. అమరవీరుల వర్ధంతి సభలు జరపాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంలో బుధవారం అన్నారుపాడు గ్రామంలో ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో అమరవీరుల వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్య ఉద్యమంలో భగత్ సింగ్, ఆజాద్, అల్లూరి, కర్తర్ సింగ్ లాంటి ఎందరో తమ ప్రాణాలను అర్పించారన్నారు. నక్సల్‌బరి పోరాటంలో దేవలపల్లి వెంకటేశ్వరరావు, తరిమెళ్ల నాగిరెడ్డి, పుల్లారెడ్డి, మాదాల నారాయణస్వామి, పైలా వాసుదేవరావు, సత్యం మాస్టర్, పంచాద్రి నిర్మల తదితరులు అమరులయ్యారన్నారు. పాలకులు ప్రజా ఉద్యమాలు, ప్రజాస్వామిక హక్కులపై దాడుల చేస్తున్నారన్నారు. బీజేపీ ప్రభుత్వం మతోన్మాదాన్ని రెచ్చగొడుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో బాదావత్ జవహర్‌లాల్, బానోత్ వీరు, తోటకూరి నరేష్, బానోత్ జగదీష్, బానోత్ ధన్వంతరావు, బాలాజీ, దస్రు, సుజాత, కైలా, ఆజాద్, వెంకన్న, బాబు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో..

భేతాళపాడు గ్రామంలో బుధవారం సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో అమరవీరుల సభ నిర్వహించారు. కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి ఎస్కే ఉమర్, వల్లోజి రమేష్, ఏనుగు రాములమ్మ, కుంజా వెంకటేశ్వర్లు, కూరాకుల నరసింహారావు, ఏనుగు సీతయ్య, వర్సా చంద్రయ్య, ఏనుగు వెంకన్న, విమలమ్మ పాల్గొన్నారు.

పాల్వంచ: భూమి, భుక్తి, విముక్తి కోసం ఎందరో అమరవీరులు తమ ప్రాణాలను అర్పించారని, వారి ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు అన్నారు. బుధవారం నటరాజ్ సెంటర్ వద్ద వీరమల్ల ఉమ అధ్యక్షతన అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ... విప్లవోద్యమంలో పేద ప్రజల కోసం ఆదివాసీ, గిరిజన ప్రజల బతుకులు మారాలని వారి సమస్యలను పరిష్కరించాలని, దోపిడీ వ్యవస్థను మార్చాలని, ఎంతోమంది ఉద్యమంలో పోరాడి అమరులయ్యారని, వారి ఆశయాలకు అనుగుణంగా ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో వీరమల్ల మల్లయ్య, మంకెన వెంకటేశ్వర్లు, ఈశ్వర్, శ్రీనివాస్, రాములు, రామచంద్రు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: భూమి, భుక్తి, పీడిత ప్రజల విముక్తి కోసం సాగుతున్న విప్లవోద్యమంలో అమరవీరుల ఆశయ సాధన కోసం పోరాడాలని న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. అమరుల వారోత్సవాలలో భాగంగా మండలంలోని సీఎస్పీబస్తీ గ్రామపంచాయతీ పరిధిలోని అమరవీరుల స్థూపం వద్ద ఎర్రజెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో కొక్కు సారంగపాణి, తోడేటి నాగేశ్వరరావు, లత, నర్సింహారావు, మండల వెంకన్న, లాలు, రాసాల లింగయ్య, గూళ్ల సదయ్య, మోహన్‌రావు, సత్యనారాయణ పాల్గొన్నారు.



పాల్వంచ: మాట్లాడుతున్న నాయకులు


జూలూరుపాడు: అన్నారుపాడులో అమరవీరులకు నివాళులర్పిస్తున్న ప్రజాపంథా నాయకులు


ఇల్లెందురూరల్: ఎర్రజెండా ఆవిష్కరిస్తున్న ఎన్డీ డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు